క్లుప్తంగా

వాటర్ క్యాన్ల పంపిణీ



ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని బయ్యక్క పేట సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలోని నీలంతోగుగూడెంలోని గొత్తికోయలకు వాటర్ క్యాన్లను మంగళవారం పంపిణీ చేశారు. తాగునీటి కోసం గూడెంలోని గొత్తికోయలు ఇబ్బందులు పడుతుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గొత్తికోయలందరికీ డీపీఎం జాలపు శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో వ్యాటర్ క్యాన్లతో పాటు క్యాన్లలో తాగునీటిని అందించారు.

ఆర్థికసాయం



గోవిందరావుపేట: చల్వాయిలోని 5వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియాన్‌లో కొంత కాలంగా కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కొమురయ్య వైద్యానికి అధిక మొత్తంలో ఖర్చు అవుతున్న విషయం తెలుసుకున్న బెటాలియాన్ కమాండంట్ కే సుబ్రహ్మణ్యం వారి సిబ్బందితో కలిసి మంగళవారం రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండంట్ అనిల్ కుమార్, ఆర్ఐలు శోభన్ బాబు, కార్తీక్, సాల్మన్ రాజు, రాంప్రసాద్, ఆర్ఎస్ఐలు, బెటాలియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో సమస్యల పరిష్కారానికి తెలంగాణ జన సమితి పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రత్నం కిరణ్ అన్నారు. తెలంగాణ జన సమితి ఆవిర్భావ వేడుకలను మంగళవారం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం కిరణ్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో ఉద్యమకాంక్షల సాధనలో నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీతో మిత్ర పక్షంగా ఉన్నప్పటికి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరం అయితే పోరాటాలు చేస్తున్నామన్నారు. సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెరగట్టయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్, శంకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

భూపాలపల్లి రూరల్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవివిరమణ తప్పనిసరి అని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కలెక్టర్ ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ కార్యాలయ (తహసీల్దార్ క్యాడర్)సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీరాంరావు పదవి విరమణ పొందాడు. దీంతో మంగళవారం అధికారులు శ్రీరాంరావుకు సన్మాన సభ ఏర్పాటు చేసి సత్కరించారు.

ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా

- పట్టాభూముల పేరుతో గోదావరిలో క్వారీ నిర్వహణ
- అధికారుల అనుమతులు లేకుండా రోడ్ల ఏర్పాటు
- లారీల్లో యథేచ్ఛగా ఇసుక తరలింపు



గంపోనిగూడెం వద్ద గోదావరిలో రోడ్డు పనులు చేస్తున్న నిర్వాహకులు

మంగపేట : మండలంలోని కమలాపురం, వాడగూడెంలో ఇసుక కాంట్రాక్టర్లు రెవెన్యూ అధికారుల సహకారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. డబ్బు, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి రెవెన్యూ, వ్యవసాయ శాఖ, జియాలజీ తదితర శాఖల్లో పలువురి అధికారులకు రూ.లక్షల్లో ముట్టజెప్పి కొందరు రైతుల పట్టా భూముల పేరుతో ఇసుక క్వారీలకు అనుమతులు పొంది గోదావరి నుంచి ఇసుకను తరలిస్తున్నారు.

అనుమతులు లేకుండా రోడ్ల నిర్మాణాలు

మండలంలోని గంపోనిగూడెం శివారు మార్కెట్ యార్డు సమీపంలోని గోదావరి నదిలో ఇసుకను తరలించేందుకు ప్రత్యేక రోడ్డును నిర్మిస్తున్నారు. పట్టా భూముల పేరుతో ఇసుకను తరలించేందుకు వారం రోజుల నుంచి గోదావరిలో ఇరిగేషన్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రోడ్లను నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వరదల కారణంగా ఎక్కడైనా పట్టాదార్ పాస్‌పుస్తకం ఉన్న పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడితే వాటిని తొలగిస్తే మళ్లీ పంటలు సాగయ్యే అవకాశం ఉన్న చోట మాత్రమే అనుమతులు ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఇసుక మేటల తొలగింపు పేరుతో అనుమతి పొందిన సర్వే నంబర్లు గోదావరిలో ఉన్నాయని అక్కడ నుంచి ఇసుకను తరలించేందుకు రోడ్లు వేయడం గమనార్హం.

గోదావరి ఒడ్డుకు కింద నుంచి 50 నుంచి 60 అడుగుల లోపల పట్టా భూములు ఉండటం ఏంటి, అక్కడ ఇసుక తీస్తే ఏ పంటలు పండుతాయని అధికారులు ఇసుక తీసేందుకు అనుమతులు ఇచ్చారనేది వెయ్యిడాలర్ల ప్రశ్న. గత ఏడాది పట్టా భూముల పేరుతో ఇసుక క్వారీ ఏర్పాటు చేసి లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించి రూ.కోట్లు కూడగట్టుకున్నారు. గోదావరిలోకి రోడ్లు వేసేందుకు మట్టిని తరలించేందుకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు అనుమతులు ఇవ్వడం విశేషం. ఇదేవిధంగా ఇప్పటికే వాడగూడెంలో సుమారు 3 కిలో మీటర్ల మేర రోడ్లు వేసి పట్టా భూముల పేరుతో గోదావరి నుంచి వేలాది లారీల ఇసుకను ఇప్పటికే తరలించడం మరో విశేషం. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి గోదావరిలో పట్టా భూములు ఉన్నట్లు సర్వే చేసి నిర్ధారించిన రెవెన్యూ అధికారులు, సాగుభూముల్లో ఇసుక మేటలు వేసినట్లు, ఇసుక మేటలను తొలగిస్తే పంటలు పండుతాయని ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇచ్చిన వ్యవసాయ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేశాం..

గోదావరిలో రోడ్డు నిర్మాణం కోసం ఇరిగేషన్ శాఖ నుంచి ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. వెంటనే రోడ్డు నిర్మాణం పనులను నిలివేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాం. అయినా ఆపకపోతే కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం.

– బుచ్చినర్సయ్య ఇరిగేషన్ ఏఈ, ఏటూరునాగారం

రోడ్డెక్కిన అన్నదాతలు



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

- పాడీ క్లీనింగ్ లేకుండా కొనుగోలు చేపట్టాలని డిమాండ్

కాటారం: కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టడంతో పాటు పాడీ క్లీనింగ్ లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కాటారం మండలం రేగులగూడెంలో అన్నదాతలు రోడ్డెక్కారు. మంగళవారం కాటారం–మంథని రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో రేగులగూడెంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని ఆరోపించారు. ధాన్యం ఆరబోసి రోజులు గడుస్తున్నాయని పాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యం తూర్పాల పట్టాలని నిర్వాహకులు నిబంధనలు విధించడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కొనుగోళ్లు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బస్తాకు కిలో చొప్పున కటింగ్ పెట్టినా పర్వాలేదు కానీ పాడీ క్లీనింగ్ నిబంధన తొలిగించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పౌరసరఫరాల శాఖ డీఎం రాములు, పీఏసీఎస్ సీఈఓ ఎడ్ల సతీశ్ ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఖచ్చితంగా పాడీ క్లీనింగ్ చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయని వారు రైతులకు నచ్చజెప్పారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. తిరుపతి, సమ్మయ్య, రాజబాబు, మనోహర్, మల్లేశ్, మొగిలి, రాజు, అంకయ్య పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’ కమిటీలను రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

టేకుమట్ల: ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఎంపీడీఓ అనితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు కాకుండా కమిటీ సభ్యులు అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. కమిటీలను రద్దు చేసి అధికారులే సర్వే నిర్వహించి అర్హులకు ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కూర సురేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు గుర్రపు నాగరాజు, బండారి సమ్మయ్య, రామారావు, ప్రభాకర్, వెంకటేష్, రాజేందర్, రాజయ్య, రవీందర్, నాంసాని రమేష్, మంద వెంకటేష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎస్సైగా కమలాకర్



అవార్డు అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

గోవిందరావుపేట: ఉత్తమ ఎస్సైగా పస్రా ఎస్సై కమలాకర్ ఎంపికయ్యారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో ఎస్పీ డాక్టర్ శబరీశ్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంస పత్రం, రివార్డ్‌ను అందుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభను గుర్తించి ఉత్తమ ఎస్సైగా ఎంపిక చేసినందుకు ఎస్పీకి ఎస్సై కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎస్సై కమలాకర్‌కి డీఎస్పీ రవీందర్, సీఐ రవీందర్, పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు స్థానికులు అభినందనలు తెలిపారు.

వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలి

కాళేశ్వరం: ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మిత అన్నారు. మంగళవారం కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా వీఐపీ ఘాట్ వద్ద పనిచేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ కూలీలు, ఉపాధిహామీ కూలీలు ఉదయం 11 గంటలకే పనులను ముగించుకొని ఇంటికి చేరుకోవాలని తెలిపారు. తెల్లని కాటన్ దుస్తులు, తలకు రుమాలు లేద టోపీ ధరించాలన్నారు. బయటకు వెళ్లే సమయంలో చల్లని నీరు తీసుకోవాలన్నారు. ఆమె వెంట సిబ్బంది సమ్మక్క తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని షిర్డి సాయిబాబా ఆలయంలో 25వ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సాయిబాబా విగ్రహానికి పంచామృత అభిషేకాలు, 108 అష్టోత్తర పూజలను అర్చకులు యల్లాప్రగఢ భానుప్రకాశ్ శర్మ నిర్వహించారు. అంతేకాకుండా పుష్పార్చనలు భక్తులతో చేయించారు. వరంగల్ వారితో సాంస్కృతిక కార్యక్రమాలను సాయిబాబా పాటలను పాడించారు. అంతేకాకుండా గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, నిర్వాహకులు కండివెండి నర్సింహాచారి, బచ్చు సతీష్, బచ్చు సత్యనారాయణ, బాలయ్య, మాధవ్, కాత యాదగిరి, వెంకట్రావు, జగదీశ్, గాడిచర్ల రాజశేఖర్, బట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కతోనే నియోజకవర్గ అభివృద్ధి

- కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు పావని



మాట్లాడుతున్న పావని

ములుగు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న హామీల తీరుపై రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి సీతక్కను ప్రశ్నించే స్థాయి బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షురాలు బడే నాగజ్యోతికి లేదని కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గుంటోజు పావని అన్నారు. జిల్లాకేంద్రంలోని గ్రామపంచాయతీ గెస్ట్ హౌజ్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాగజ్యోతి బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా, చైర్ పర్సన్‌గా ఉండి చేసిన అభివృద్ధి ఎంటో ప్రజలకు తెలియజేయాలే తప్పా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి సీతక్కపై అభండాలు వేయడం మానుకోవాలని హితవు పలికారు. మంత్రి సీతక్కతోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకురాళ్లు అల్లూరి సంధ్య, పిట్టల రాధిక, పోలోజు గౌతమి, మాధవి, జక్కుల కవిత, జయ, స్వరూప, సోంబలక్ష్మీ, విజయ, సుమలత, రాధ, ఈశ్వరమ్మ, సౌందర్య, సరళ, పావని, లక్ష్మీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వొద్దు

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండలంలో ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వొద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాటి నాగరాజు తెలిపారు. ఈమేరకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ భారతిలో గిరిజనేతరులకు భూ పట్టాలు ఇవ్వకుండా గిరిజనుల సాగులో ఉన్న భూములకు మాత్రమే హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొగ్గుల సమ్మయ్య, శ్యామల వెంకటేశ్వర్లు, ఉయిక గోపి, శ్యామల వంశీ, కనితి శేషు తదితరులు ఉన్నారు.

చిరుతల రామాయణం ప్రత్యేకమైనది



కళాకారులను సన్మానిస్తున్న సూరయ్య

కన్నాయిగూడెం: జానపదకళల్లో చిరుతల రామాయణం ప్రత్యేకమైనదని దుర్గం సూరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ సూరయ్య అన్నారు. మండలంలోని బుట్టాయిగూడెంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం చిరుతల రామాయణం జానపద కళా ప్రదర్శనను గ్రామంలోని యువకులు ప్రదర్శన చేస్తున్నారు. కాగా, సోమవారం రాత్రి దుర్గం సూరయ్య వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ దుర్గం సూరయ్య నేతకాని రాష్ట్ర నాయకులు గోగు మల్లయ్యతో కలిసి ప్రదర్శన వద్దకు వచ్చి కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనగం శ్రీనువాస్, రామారావు, పోషయ్య, చందర్‌రావు, రాంబాబు, బందరు జనగం నవీన్, సమ్మయ్య పాల్గొన్నారు.

వసతుల పరిశీలన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు నిర్వహించే సరస్వతి పుష్కరాలకు వైద్యారోగ్య, పోలీస్, పంచాయతీ శాఖల నుంచి విధులు నిర్వర్తించే సిబ్బందికి వసతుల ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావులు మంగళవారం పరిశీలించారు. కాళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని గదులను పరిశీలించి, పలుశాఖలకు గదులను కేటాయించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతుల విషయంలో జరుగుతున్న మరమ్మతు, అదనపు టాయిలెట్స్ పనులు పరిశీలించి తగుసూచనలు చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



చిట్యాల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: రైతులు దళారునలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని నైన్‌పాక, జడలపేట, ఒడితల, దూద్‌పల్లి గ్రామాలలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు మద్దతు ధర పొందాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యం తీసుకరావాలని అన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్త పడాలని రైతులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో ప్రక్రియ సాఫీగా సాగే విధంగా అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని కోరారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి–సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, ఎంపీడీఓ జయశ్రీ, పాల్గొన్నారు.

దేవదాసు మృతి పార్టీకి తీరని లోటు

మండలంలోని అందుకుతండా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని దేవదాసు మృతి పార్టీకి, ఆయన కుటుంబ సభ్యులకు తీరని లోటని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎమ్మెల్యే మంగళవారం అందుకుతండాలో దేవదాసు మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట యూత్ అధ్యక్షుడు కుమార్, మాజీ సర్పంచ్ సిద్దంకి భాస్కర్, సంపత్, శనిగరపు భద్రయ్య ఉన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

భూపాలపల్లి రూరల్: రానున్న ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సంస్థగత ఎన్నికల జిల్లా పరిశీలకులు వెంకట్రామిరెడ్డి, మాసంపెల్లి లింగాజీ హాజరై దిశ నిర్దేశం చేశారు. ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నల్లమట్టితో అధిక దిగుబడి

- చెరువు మట్టి పొలాల్లో పోయించుకుంటున్న రైతులు
- సారవంతంగా మారనున్న భూమి



చెలుకలో పోయించుకున్న చెరువు మట్టి

రేగొండ: పంట దిగుబడి పెరగాలని రైతులు పొలంలో ఎరువులు, రసాయనాలు చల్లుతూ పంట సాగు చేస్తున్నారు. పెరిగిన ఎరువుల ధరలతో పాటు పంటలకు అధికంగా ఎరువులు వాడడంతో పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. రసాయన ఎరువుల వాడంతో భూమి కూడా దెబ్బతింటుంది. దీంతో సేంద్రీయ ఎరువుల వాడకంతో పాటు రైతులు పంట పొలంలో చెరువు పూడిక మట్టిని పోయించుకుంటున్నారు. దీంతో భూమి సారవంతంతో పాటు దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

వేసవిలో అనుకూలం..

వ్యవసాయ భూముల్లో చెరువులోని సారవంతమైన పూడిక మట్టిని వేసుకోవడం కోసం వేసవి కాలంలో చెరువులు ఎండిపోవడంతో పూర్తిగా నల్లమట్టి లభిస్తుంది. పూడిక తీసేందుకు అనుకూలమైన సమయంలో అలాగే చేలలో ఎలాంటి పంట ఉండదు. కావున పూడిక మట్టిని వ్యవసాయ భూముల్లో పోయించుకుంటున్నారు.

చెరువు మట్టితో ప్రయోజనాలు..

- చెరువు మట్టిని పొలాల్లో వేయడం వలన ఆమ్ల, క్షార గుణాలతో భూమి బలంగా మారుతుంది.
- నేలల్లో లవణాల గాఢత తగ్గుతుంది. సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయి, ముఖ్యంగా నత్రజని స్థాయి పెరుగుతాయి.
- రసాయనిక ఎరువుల వాడకం కొంత మేర తగ్గుతుంది.
- మొక్కలు ఆరోగ్యంగా, ఎత్తుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

పంట దిగుబడి పెరిగింది



యాసంగి సీజన్‌లో రెండు ఎకరాల్లో చెరువు మట్టిని తోలాను. దీంతో యూరియా, పురుగు మందుల వాడకం తగ్గింది. గతంతో పోలిస్తే ఈ సారి దిగుబడి పెరిగింది. ప్రస్తుతం కూడా చెరువులోని పూడిక మట్టిని పోయిస్తా.

– మానూరి అశోక్, రైతు

భూసారం వృద్ధి చెందుతుంది



చెరువు మట్టిలో సేంద్రీయ కర్బనాలు, సూక్ష్మపోషకాలు ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఇసుక, దుబ్బ నేలల్లోను నల్లమట్టి పోస్తే భూసారం వృద్ధి చెందుతుంది. తేమ శాతం కూడా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. పంట ముగిసే వరకు ఎరువుల పని చేస్తుంది.

– వాసుదేవరెడ్డి, ఏఓ, రేగొండ

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



స్వామి(ఫైల్)

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన వాసంపల్లి స్వామి(30) విజయవాడలో ద్విచక్ర వాహనంపై నుంచి ప్రమాదవశాత్తు పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన స్వామికి ఇద్దరు భార్యలు, ఇద్దరు పిల్ల లు ఉన్నారు. పెద్ద భార్య జగన్నాథపురం గ్రామంలో పిల్లలతో ఉంటుండగా బతుకుదెరువు కోసం చిన్న భార్యతో కలిసి వెళ్లి గత కొన్ని నెలలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో ఉంటున్నాడు. శనివారం పనిపై బయటకు వెళ్లిన సమయంలో ద్విచక్ర వాహనంపై నుంచి ప్రమాదవశాత్తు పడి పోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కాగా అతడిని వైద్యశాలలో చేర్పించారు. వైద్యం పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.